కాంగ్రెస్‌ను నమ్మితే మోసపోతారు



హన్వాడలో మంత్రి శ్రీనివాస్‌గౌడ్ కార్నర్ మీటింగ్‌కు హాజరైన ప్రజలు



షాషాబ్‌గుట్ట దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న మంత్రులు మహమూద్‌అలీ, శ్రీనివాస్‌గౌడ్

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ/మహబూబ్‌నగర్ న్యూటౌన్/మహబూబ్‌నగర్ రూరల్/హన్వాడ: మైనారిటీల సంక్షేమం బీఆర్‌ఎస్‌తోనే సాధ్యమని రాష్ట్ర హోంశాఖ మంత్రి మహమూద్ అలీ, ఎక్సైజ్, క్రీడల శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. శుక్రవారం స్థానిక షాషాబ్‌గుట్ట, మోటార్‌లైన్ మసీదుల వద్ద నమాజ్ అనంతరం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అలాగే షాషాబ్‌గుట్ట దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ ప్రభుత్వం ముస్లిం మైనారిటీల అభ్యున్నతి, సంక్షేమానికి పెద్దపీట వేసిందన్నారు. మహబూబ్‌నగర్ అంటేనే భిన్నత్వంలో ఏకత్వానికి, మత సామరస్యానికి నిలయంగా మార్చామన్నారు. తెలంగాణ లోనే మొట్ట మొదటి హజ్‌హౌస్ ఇక్కడే నిర్మించామన్నారు. ఆయా కార్యక్రమాల్లో పార్టీ సీనియర్ నాయకులు సయ్యద్ ఇబ్రహీం, జావేద్ బేగ్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ రహమాన్, 19వ వార్డు కౌన్సిలర్ షబ్బీర్‌అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

'ముఖ్యమంత్రి కేసీఆర్‌ను అడిగిన వెంటనే హేమసముద్రం రిజర్వాయర్‌ను మంజూరు చేశారు... కానీ తమ గ్రామం ముంపునకు గురవుతోందని బుద్ధారం గ్రామస్తులు మొరపెట్టుకోవడంతో వారి అభిప్రాయం మేరకు నిర్మాణాన్ని వదులుకున్నామని మంత్రి శ్రీనివాస్‌గౌడ్ పేర్కొన్నారు. శుక్రవారం సల్లోనిపల్లి, హన్వాడ మండల కేంద్రంలో ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా భారీగా తరలివచ్చిన జనం ఆయనకు ఘనస్వాగతం పలికారు. మంత్రి ఆయాగ్రామాల్లో రోడ్‌షోల్లో ప్రజలకు అభివాదం చేశారు. ప్రజలనుద్దేశించి మాట్లాడారు. కాంగ్రెస్‌ను నమ్మితే మోసపోవడం ఖాయమన్నారు. హామీల పేరుతో దగా చేయడానికి వచ్చారని ఆరోపించారు. 3గంటల కరెంటు సరిపోతుందని రేవంత్‌రెడ్డి అంటున్నాడని.. సరిపోతుందా? అని ప్రశ్నించారు. మతం పేరిట గొడవలు పెట్టి పారిపోయినవారిని నమ్మొద్దన్నారు.

చెరువులన్నీ నింపుతాం...

పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతల ద్వారా నియోజకవర్గంలోని అన్ని చెరువులు నింపి, ప్రతీ ఎకరానికి సాగునీటిని అందిస్తామని ఈ సందర్భంగా మంత్రి భరోసా ఇచ్చారు. జిల్లాకేంద్రంలోని పా త కలెక్టరేట్ స్థానంలో 1000పడకల ఆస్పత్రి నిర్మిస్తున్నామని వివరించారు. చిన్నదర్పల్లి నుంచి భూత్పూర్ వరకు బైపాస్ రోడ్డు నిర్మాణ పనులు కొనసాగుతున్నాయని, అది పూర్తి అయితే పాలమూరుకు మణిహారంలా మారుతుందన్నారు. హన్వాడలో చేపట్టే ఫుడ్‌పార్క్‌తో ఎవరికీ నష్టం జరగకుండా చర్యలు తీసుకుంటామని వివరించారు. మాజీ మంత్రి చంద్రశేఖర్, మాజీ ఎమ్మెల్యే ఎర్రశేఖర్, ఎంపీపీ బాల్‌రాజు, జెడ్పీటీసీ విజయనిర్మల, బీఆర్‌ఎస్ అధ్యక్షుడు కరుణాకర్‌గౌడ్, నాయకులు వడ్లశేఖర్, నరేందర్, బాలయ్య, లక్ష్మయ్య, వెంకటయ్య, కృష్ణయ్యగౌడ్, మాధవులుగౌడ్, రమణారెడ్డి, అనంతరెడ్డి, రేవతి, సత్యం, పెంటయ్య, చెన్నయ్య పాల్గొన్నారు.

పార్టీలో చేరికలు

మహ్మద్‌ఖాన్‌పల్లి తండాకు కాంగ్రెస్ నాయకులు, రూరల్ మండలం మాచన్‌పల్లికి చెందిన యాదవ యూత్, జైనల్లీపూర్ బీజేపీ నాయకులు తదితరులు మంత్రి శ్రీనివాస్‌గౌడ్ సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు.

ఓబ్లాయిపల్లిలో జెడ్పీటీసీ సభ్యురాలు పి.వెంకటేశ్వరమ్మ, రవీందర్‌రెడ్డి ప్రచారం నిర్వహించారు. రాజవర్ధన్‌రెడ్డి, వెంకటస్వామి, రాజు, శ్రీనివాస్, లక్ష్మారెడ్డి, మూసా తదితరులు పాల్గొన్నారు.



బీఆర్‌ఎస్‌లో చేరుతున్న జైనల్లీపూర్ నాయకులు



ప్రజలకు అభివాదం చేస్తున్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్

మరోసారి గెలిపించండి

రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమాన్ని కొనసాగించేందుకు రాబోయే ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటు వేసి మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌ను మరోమారు గెలిపించాలని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బి.రాజేశ్వర్‌గౌడ్ కోరారు. శుక్రవారం మండల పరిధిలోని ఓబ్లాయిపల్లి తండా, సూగూరుగడ్డ తండా, జమిస్తాపూర్, తెలుగుగూడెం గ్రామాలలో బీఆర్‌ఎస్ అభ్యర్థి, మంత్రి శ్రీనివాస్‌గౌడ్ గెలుపు కోరుతూ ప్రచారం నిర్వహించారు. శ్రీనివాస్‌గౌడ్ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేశారని అన్నారు. ఓబ్లాయిపల్లి తండా, సూగూరుగడ్డ తండా, జమిస్తాపూర్, తెలుగు గూడెం గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. ముడా డైరెక్టర్ ఆంజనేయులు, సర్పంచ్ కుర్వ రాణెమ్మ, ఉప సర్పంచ్ రామచంద్రయ్య, మండల అధ్యక్షుడు శ్రీనివాస్‌యాదవ్, ప్రధాన కార్యదర్శి వై.శ్రీనివాసులు, నాయకులు పి.రవీందర్ రెడ్డి, కుర్వ శ్రీనివాసులు, వరద తిరుపతయ్య, మల్లు రఘువర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ప్రచారం నిర్వహిస్తున్న జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేశ్వర్‌గౌడ్

బీజేపీతోనే అభివృద్ధి, సంక్షేమం



చౌదర్‌పల్లిలో ప్రసంగిస్తున్న బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఏపీ మిథున్‌కుమార్‌రెడ్డి

మహబూబ్‌నగర్ రూరల్/పాలమూరు/మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: బీజేపీ గెలుపుతోనే పేదవర్గాల సంక్షేమం, తెలంగాణ అభివృద్ధి సాధ్యమని అభ్యర్థి ఏపీ మిథున్‌రెడ్డి అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా శుక్రవారం మండల పరిధిలోని ధర్మాపూర్, నర్సాపూర్, చౌదర్‌పల్లి గ్రామాల్లో పర్యటించారు. ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతు, మహిళ, యువ సాధికారతకు మోదీ ప్రభుత్వం అనేక పథకాలు అమలు చేస్తుందని చెప్పారు. కేసీఆర్ సర్కారు కుటుంబ పాలనకు తోడు అవినీతిలో కూరుకుపోయిందని ఆరోపించారు. ప్రజలు మార్పు కోరుకుంటున్నారని అన్నారు. బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే రైతులకు అన్ని విధాలుగా అండగా ఉంటామన్నారు. వరికి క్వింటాలుకు రూ. 3,100 మద్దతు ధర చెల్లిస్తామని అన్నారు. రేషన్ బియ్యాన్ని మోదీ ప్రభుత్వం అందిస్తుంటే కొత్త రేషన్ కార్డులను కేసీఆర్ ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నించారు. ఒకసారి తనకు ఎమ్మెల్యేగా అవకాశం ఇస్తే అభివృద్ధి చేసి చూపుతానని అన్నారు. ధర్మాపూర్ సర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో పలువురు మిథున్ రెడ్డి సమక్షంలో బీజేపీలో చేరారు. రాష్ట్ర మహిళా మోర్చా కార్యవర్గ సభ్యురాలు జయశ్రీ, జిల్లా కోశాధికారి పాండురంగారెడ్డి, సర్పంచ్‌లు శ్రీనివాస్‌రెడ్డి, శంకరమ్మ, మండల అధ్యక్షుడు రాజుగౌడ్, ప్రధాన కార్యదర్శులు మహేష్‌గౌడ్, శశిధర్‌రెడ్డి, నాయకులు జాం శ్రీనివాసులు, శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు. నియోజకవర్గంలో శుక్రవారం పలు శుభకార్యాలయాల్లో అభ్యర్థి మిథున్‌రెడ్డి పాల్గొన్నారు. వివాహ వేడుకల్లో నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఓటు అభ్యర్థించారు. జిల్లా కేంద్రంలోని పద్మావతి కాలనీలోని నివాసంలో శుక్రవారం మిథున్‌రెడ్డి నాయనమ్మ ఏపీ ఈశ్వరమ్మ ఓటు హక్కును వినియోగించుకున్నారు.

తనను ఎన్నికల్లో గెలిపించి అసెంబ్లీకి పంపిస్తే పాలమూరును అన్ని రంగాల్లో నంబర్‌వన్‌గా మారుస్తానని బీజేపీ అభ్యర్థి ఏపీ మిథున్‌రెడ్డి హామీ ఇచ్చారు. శుక్రవారం రాత్రి స్థానిక మర్లు, నలంద ఆటోస్టాండ్, షాషాబ్‌గుట్ట, న్యూటౌన్ తదితర ప్రాంతాల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. మైనారిటీల సంక్షేమానికి కేంద్ర ప్రభుత్వం ఎంతో కృషి చేస్తోందన్నారు. మేనిఫెస్టోలో రూపొందించిన 'మోడీ గ్యారంటీ'ని తప్పకుండా అమలు పరుస్తామన్నారు. 'రొట్టెముక్కను గాలిలో విసిరి కొట్టుకుచావండి..' అన్న విధంగా సీఎం కేసీఆర్ వివిధ పథకాలను ఎరచూపుతున్నారని ఎద్దేవా చేశారు. మూడో సారి బీఆర్‌ఎస్‌ను గెలిపిస్తే కబ్జాలు, బెదిరింపులు, అరాచకాలు, దౌర్జన్యాలు ఎక్కువవుతాయన్నారు. ఈ ఎన్నికల్లో అధికారపార్టీ నేతలకు తగిన గుణపాఠం చెప్పాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఇక 2012 ఉప ఎన్నికలో బీజేపీ కార్యకర్తల కృషి, పాలమూరు ప్రజల అభిమానంతో గెలిచిన యెన్నం శ్రీనివాస్‌రెడ్డి.. రెండున్నరేళ్ల తర్వాత ఓడిన వెంటనే తన స్వలాభం కోసం ఎటో దూరం వెళ్లిపోయారని ఆరోపించారు. యువమోర్చా జిల్లా అధ్యక్షుడు కిరణ్‌కుమార్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు నారాయణయాదవ్, బీజేపీ నాయకులు సంపత్‌కుమార్, తిరుపతిరెడ్డి, అరవింద్‌గౌడ్, నవీన్, శ్రీనాథ్, మహేష్, వెంకటేష్ పాల్గొన్నారు.



మిథున్‌రెడ్డికి మంగళహారతి ఇస్తున్న యువతులు, మహిళలు

ఓటు వజ్రాయుధం వంటిది

బాలానగర్: మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో శుక్రవారం మాక్‌పోలింగ్ నిర్వహించారు. విద్యార్థులు ఈ ఎన్నికల్లో పాల్గొన్నారు. ఎన్నికల విధానంపై అవగాహన కల్పించేందుకు కార్యక్రమం నిర్వహించినట్లు హెచ్‌ఎం శంకర్ తెలిపారు. ఓటు వజ్రాయుధం వంటిదని.. సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఉపాధ్యాయులు చంద్రకాంత్, ప్రభాకర శర్మ, సరితాదేవి, అయ్యప్ప రెడ్డి, పద్మావతి, జాయ్‌జెర్సీ, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



ప్రజలు మార్పు కోరుతున్నారు

దేవరకద్ర/భూత్పూర్/దేవరకద్ర రూరల్ : ప్రజలు మార్పు కోరుతున్నారని కాంగ్రెస్ అభ్యర్థి జి.మధుసూదన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం నియోజకవర్గంలోని తాటికొండ, అన్నాసాగర్, తాటిపర్తి, కొత్తూర్, భూత్పూర్ పట్టణం, మద్దిగట్ల గ్రామాలతో పాటు దేవరకద్ర మండల డొకూర్, జీనగరాల, మీణగోనిపల్లి గ్రామాలల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. డిసెంబర్ 3న కాంగ్రెస్‌కు అనుకూలం ఫలితాలు రాబోతున్నాయని.. తాము అధికారంలోకి రావడం ఖాయమన్నారు. వెంటనే ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేస్తామని తెలిపారు. బీఆర్‌ఎస్ పాలన పట్ల ప్రజలు విసిగి పోయారని తెలంగాణ వచ్చాక కేసీఆర్ కుటుంబం, ఎమ్మెల్యేలు వారి తొత్తులే అభివృద్ధిలోకి వచ్చారని ఆరోపించారు. నిజమైన పేదలకు సంక్షేమ పథకాలు అందకుండా చేశారని అదే వారికి ఇప్పుడు శాపం కాబోతున్నదన్నారు. బీఆర్‌ఎస్ ఎన్ని జిమ్మిక్కులు చేసినా ప్రజలు నమ్మేస్థితిలో లేరని అన్నారు. నియోజక వర్గంలో అభివృద్ధి పేరిట రూ.కోట్లు దోచుకున్నారని ఆరోపించారు. ఇసుక, నల్లమట్టిని అమ్ముకున్న ఘనత బీఆర్‌ఎస్‌దేనని విమర్శించారు. వారి మాటలను నమ్మి మోసపోవద్దని సూచించారు. కర్వెన ప్రాజెక్టులో భూములు కోల్పోయిన వారికి న్యాయం చేయలేదన్నారు. కార్యక్రమాల్లో ఆయా మండలాల అధ్యక్షులు, నాయకులు కేసి రెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, వెంకట్ నర్సింహారెడ్డి, లిక్కి నవీన్ గౌడ్, ఎంపీటీసీ పుల్లయ్య, మాధవరెడ్డి, మోహిన్, చిల్లా రఘురెడ్డి, వెంకటేష్, గోపాల్‌రెడ్డి, రామకృష్ణరెడ్డి, అంజిల్‌రెడ్డి, భీంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



దోకూర్‌లో మాట్లాడుతున్న కాంగ్రెస్ అభ్యర్థి జి.మధుసూదన్‌రెడ్డి



ర్యాలీకి తరలివచ్చిన ప్రజలు



తాటిపర్తిలో..

దామరగిద్దకు డిగ్రీ కళాశాల తెస్తాం



ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి రోడ్ షో లో నృత్యం చేస్తున్న బంజార మహిళలు



ఓటు అభ్యర్థిస్తున్న ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి

దామరగిద్ద/మరికల్/నారాయణపేట: కారుగుర్తుకు ఓటేసి బీఆర్‌ఎస్ ప్రభుత్వాన్ని అధికారంలోకి తీసుకొస్తే కర్వెన నుంచి కాన్‌కుర్తి రిజర్వాయర్ నుంచి దామరగిద్దకు సాగునీరు అందించి తీరుతానని ఎమ్మెల్యే ఎస్ రాజేందర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో నిర్వహించిన రోడ్‌షోలో ఆయన మాట్లాడారు. స్థానిక నాయకులు, ప్రజలు గజమాలతో ఘనస్వాగతం పలికారు. అంతకు ముందు కాన్‌కుర్తిలో రోడ్ నిర్వహించారు. ఈ మేరకు.. ఆయన మాట్లాడుతూ.. గత పదేళ్లుగా తాను చేసిన అభివృద్ధిని చూసి ఓటు వేయాలన్నారు. పక్క రాష్ట్రాన్ని పాలిస్తున్న కాంగ్రెస్ ప్రజలను మోసం చేసిందన్నారు. తెలంగాణ ప్రజలను మభ్యపెట్టిందుకు.. కళ్లబొల్లి మాటలతో ఓట్లు అడిగేందుకు వస్తున్నారన్నారు. రైతులకు 24 విద్యుత్, ఆసరా పింఛన్స్ రైతుబంధు, రైతుబీమా, కల్యాణలక్ష్మి, ధరణి వంటి పథకాలతో పాటు సాగునీరు అందాలంటే కారుగుర్తుకు ఓటు వేయాలని సూచించారు.

ఏడాది లోపల నీళ్లు తెచ్చిస్తా

ఎత్తైనా ప్రాంతమైన దామరగిద్దకు సాగునీరు అందించేందుకు పాలమూరు రంగారెడ్డి ద్వారా సీఎం కేసీఆర్‌తో పట్టుబట్టి కర్వెన నుంచి కాన్‌కుర్తి రిజర్వాయర్ నిర్మాణానికి నెల రోజుల క్రితం చీఫ్ ఇంజినీర్లతో కలిసి ప్రణాళిక సిద్ధం చేయించినట్లు వివరించారు. ఏడాది లోపు రిజర్వాయర్ ద్వారా దామరగిద్ద రైతులకు సాగునీరు తెచ్చిస్తానన్నారు. దామరగిద్దకు డిగ్రీ కాలేజీ తెస్తానని, ప్రస్తుతం ఉన్న పీఎచ్‌సీ ఆస్పత్రిని సీఎచ్‌సీగా మార్చి 30 పడకలకు పెంచుతామని హామీ ఇచ్చారు. కారుగుర్తుకు ఓటేసి గెలిపించాలని కోరారు. జెడ్పీటీసీ లావణ్య, ఎంపీపీ నర్సప్ప, మాజీ జెడ్పీటీసీ వెంకటమ్మ, స్థానిక సర్పంచ్ ఆశమ్మ, ఎంపీటీసీ ఈశ్వరమ్మ, మాజీ ఎంపీపీ సువర్ణమ్మ, రైతుబంధు సమితి జిల్లా అధ్యక్షుడు భీమయ్యగౌడ్, వింగ్ అధ్యక్షుడు ఈదప్ప, మండల అధ్యక్షుడు ఆశన్న, ఎంపీపీ నర్సప్ప, చంద్రకాంత్, అశోక్‌గౌడ్, శ్రీనివాస్‌శెట్టి, శరణప్ప, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

మూడోసారి బీఆర్‌ఎస్ గెలుపును ప్రతిపక్షాలు ఏమాత్రం అడ్డుకోలేరని జెడ్పీవైస్ చైర్‌పర్సన్ సురేఖ అన్నారు. శుక్రవారం మరికల్ మండలంలోని ఆయా గ్రామాల్లో ప్రచారం చేశారు. ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డిని మరోసారి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో తిరుపతయ్య, కృష్ణారెడ్డి, రాజేష్, రాములు, శ్రీనివాస్‌రెడ్డి, శేఖర్, మల్లేష్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి శుక్రవారం జిల్లా కేంద్రంలోని ప్రధాన మసీదుల సమీపంలో ముస్లిం మైనార్టీల ఓటర్లను ఆప్యాయతంగా పలకరించారు. ఓట్లు అభ్యర్థించారు. సమావేశంలో మాట్లాడారు. ముస్లింలంతా ఏకమై తనకు మరోసారి మద్దతు తెలపాలని కోరారు. ఎమ్మెల్యే సతీమణి స్వాతిరెడ్డి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. లోకుర్తిలో 30 మంది బీఆర్‌ఎస్‌లో చేరారు.

బీసీ ముఖ్యమంత్రి

చిన్నచింతకుంట/దేవరకద్ర: బీజేపీ అధికారంలోకి వస్తే బీసీ ముఖ్యమంత్రి అవుతారని పార్టీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ అన్నారు. శుక్రవారం నియోజకవర్గంలోని వివిధ మండలాల్లో ప్రచారంలో భాగంగా నిర్వహించిన రోడ్ షోల్లో పాల్గొని ప్రసంగించారు. అభ్యర్థి కొండ ప్రశాంత్‌రెడ్డి, పవన్‌కుమార్‌రెడ్డి, నంబిరాజు, దశరథ్ పాల్గొన్నారు.

స్వచ్ఛతాహీ సేవ

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: స్వచ్ఛ భారత్‌లో భాగంగా ఎన్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో శుక్రవారం జిల్లాకేంద్రంలో 'స్వచ్ఛతాహీ సేవ' నిర్వహించారు. రీజినల్ డైరెక్టరేట్ ఆఫ్ హైదరాబాద్ సంజయ్‌కుమార్, వలంటీర్లు, ఎన్‌ఎస్‌ఎస్ కో–ఆర్డినేటర్ డా.కె.ప్రవీణ, అధికారులు పాల్గొన్నారు.

80 లీటర్ల మద్యం పట్టివేత

అడ్డాకుల: అనుమతి లేకుండా మద్యాన్ని తరలిస్తున్న వాహనాన్ని పట్టుకున్నామని ఎస్‌ఐ మాధవరెడ్డి తెలిపారు. మండల కేంద్రంలోని జాతీయ రహదారిపై శుక్రవారం తనిఖీలు చేస్తుండగా ఓ వాహనంలో 445 క్వార్టర్ సీసాల్లో 80 లీటర్ల మద్యం పట్టుబడిందని.. విలువ రూ.88వేల వరకు ఉన్నట్లు వెల్లడించారు. మద్యాన్ని తరలిస్తున్న సురేష్, డ్రైవర్ కాశన్నపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

కాంగ్రెస్‌కు ఓటేస్తే కటిక చీకటే



జడ్చర్ల: పొరపాటున కాంగ్రెస్‌కు ఓటేస్తే కటిక చీకట్లు కమ్ముకోవడం ఖాయమని ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి తెలిపారు. శుక్రవారం మండల పరిధిలోని శంకరాయపల్లి తండా, గొల్లోని దొడ్డి తండా, కొత్తతండా, పోచమ్మగడ్డ తండా, మల్లెబోయిన్‌పల్లి ,తదితర గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. తెలంగాణను అన్ని రంగాలలో దేశంలోనే నంబర్ వన్‌గా సీఎం కేసీఆర్ తీర్చిదిద్దారని అన్నారు. కరువు జిల్లాగా పేరొందిన పాలమూరును సస్యశ్యామలంగా మార్చామని, వచ్చే ఏడాది జడ్చర్ల నియోజకవర్గానికి పాలమూరు ఎత్తిపోతల ద్వార సాగునీరు అందించే పరిస్థితి ఉందన్నారు. ప్రజలు సంతోషంగా ఉండాలంటే మళ్లీ కేసీఆర్‌ను సీఎం చేసుకుందామని పిలుపునిచ్చారు. కారు గుర్తుకు ఓటేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.

సమస్యల పరిష్కారమే ధ్యేయం

మిడ్జిల్/నవాబుపేట: నియోజక వర్గంలో ప్రజల సమస్యలను పరిష్కరించడమే ధ్యేయంగా పనిచేస్తామని.. కాంగ్రెస్‌కు ఒక్క అవకాశం ఇవ్వాలని అభ్యర్థి అనిరుధ్ రెడ్డి అన్నారు. శుక్రవారం బోయిన్‌పల్లి, మల్లాపూర్, కొత్తూర్, వెలుగొమ్ముల, అయ్యవారిపల్లి, చిల్వేర్, కొత్తపల్లి, కంచన్‌పల్లి, భైరంపల్లి గ్రామాల్లో ప్రచారంలో మాట్లాడారు. పది సంవత్సరాల్లో బీఆర్‌ఎస్ చేసిన అభివృద్ధి శూన్యమన్నారు. నాయకులు రబ్బానీ, అల్వాల్‌రెడ్డి, గౌస్, సాయిలు. ప్రశాంత్‌రెడ్డి, మల్లిఖార్జున్, శంకర్‌నాయక్, శ్రీను నాయక్ తదితరులు పాల్గొన్నారు.

నవాబుపేట మండల కేంద్రానికి చెందిన వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు అభ్యర్థి అనిరుధ్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. మండల అధ్యక్షుడు రాంచంద్రయ్య, అజహర్, ఆంజనేయులు, కుమార్, మల్లేష్ తదితరులు ఉన్నారు.



పార్టీలో చేరిన వారితో జడ్చర్ల కాంగ్రెస్ అభ్యర్థి అనిరుధ్‌రెడ్డి

సబ్బండ వర్గాల సంక్షేమం



రాచాలలో ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డికి మద్దతుగా మంత్రి శ్రీనివాస్‌గౌడ్ ప్రచారం

మదనాపురం/కొత్తకోట రూరల్/అడ్డాకుల: మదనాపురం మండలంలోని దుప్పల్లిలో ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి ప్రచారం నిర్వహించారు. సబ్బండ వర్గాల సంక్షేమం కోసం బీఆర్‌ఎస్ పాటుపడుతోందని మరోసారి అవకాశం ఇవ్వాలని కోరారు. ఓట్ల కోసం ఊర్లలోకి వస్తున్న కాంగ్రెస్ నాయకుల మాటలను నమ్మితే ఆగమవుతారని ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. అడ్డాకుల మండలం కందూర్, సుంకరామయ్యపల్లి, పొన్నకల్, రాచాల గ్రామాల్లో శుక్రవారం రాత్రి ఆయన పర్యటించి ప్రచారం చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ నాగార్జున్‌రెడ్డి, జెడ్పీటీసీ రాజశేఖర్‌రెడ్డి, వివిధ గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు తదితరులు ఉన్నారు. ఆల వెంకటేశ్వర్‌రెడ్డిని మరోసారి గెలిపించాలని ఆయన సతీమణి మంజుల కొత్తకోట పరిధిలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పంచాయతీగా ఉన్న కొత్తకోటను మున్సిపాలిటీగా గుర్తింపు తీసుకొచ్చి ప్రత్యేక నిధుల ద్వారా ఎంతో అభివృద్ధి చేశారని వివరించారు. సుభాష్, ఎంపీపీ గుంత మౌనిక, నిర్మలమ్మ, భీమ ప్రసన్నలక్ష్మి తదితరులు ఉన్నారు.